క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

చేబ్రోలు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వై.నేతాజీ కోరారు. అంగన్‌వాడీ వర్కర్ల పోరుయాత్ర మూడోరోజు శుక్రవారం పొన్నూరుకు చేరుకుంది. పొన్నూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, వంట సామాను, కంటిన్మెంట్ బిల్లులు, అద్దెలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎంవీ సుకన్య, రమాసుశ్మ, జి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. దీప్తి మనోజ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ పోరు యాత్ర శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో దీప్తి మనోజ అంగన్‌వాడీలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ఏపీలో అంగన్‌వాడీ ఉద్యోగులకు తెలంగాణ కన్నా అదనంగా జీతాలు చెల్లించాలన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులు చెల్లించాలని కోరారు. యూనియన్ గుంటూరు జిల్లా గౌరవాధ్యక్షుడు వై.నేతాజీ మాట్లాడుతూ అంగనవాడీ వర్కర్స్ ఐకమత్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రత్తిపాడు ప్రాజెక్టు కార్యదర్శి కె.పద్మ మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రత్తిపాడు ప్రాజెక్టు కోశాధికారి నగరాజకుమారి, కమల జ్యోతి, జిక్కి, శివపార్వతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై ఎస్‌ఈబీ దాడులు


12 మంది జూదరులు, రూ.65,860 నగదు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

పెదకాకాని: పేకాట స్థావరంపై ఎస్‌ఈబీ పోలీసులు దాడి చేసి, 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వెనుక వైపు ఉన్న ఆర్కే విల్లాస్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం పోలీసులకు అందింది. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఆర్కే విల్లాస్‌లో ఎస్‌ఈబీ పోలీసులు దాడులు చేశారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.65,860 నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా గుంటూరు, విజయవాడ ప్రాంతాల నుంచి ఆర్కే విల్లాస్‌కు చేరుకుని పేకాటలు ఆడుతున్నట్లు సమాచారం. జూదరులను పెదకాకాని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.

బ్లడ్ క్యాన్సర్‌కు స్టెమ్ సెల్ థెరపీ

గుంటూరు ఎడ్యుకేషన్ బ్లడ్ క్యాన్సర్ చికిత్సా విధానంలో కీమో థెరపీ, రేడియేషన్‌తో నయం కాని కేసులకు స్టెమ్ సెల్ థెరపీతో సత్ఫలితాలు సాధించవచ్చునని బెంగళూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ డీకేఎంఎస్- బీఎంఎస్టీ ఫౌండేషన్ ఇండియా అసోసియేట్ డోనార్ రిక్రూటర్ ఆర్. కృతిక పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాల ఆధ్వర్యంలో బ్లడ్ క్యాన్సర్ నివారణ పద్ధతులు, చికిత్స విధానంపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృతిక మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మకాలజీ, ఫార్మసీ ప్రాక్టీసు, బయోటెక్నాలజీ విభాగాధిపతులు డాక్టర్ బ్రహ్మ శ్రీనివాసరావు, డాక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ కె. హేమకుమారి, జె. శివజ్యోతి పాల్గొన్నారు.

‘కిట్స్’ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, అధ్యాపకుడి లక్ష్య సాధనకు కృషి చేసి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎం.పూర్ణచంద్రరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. ‘డి నాయిసింగ్ ఆఫ్ ఈఈజీ సిగ్నల్స్ యూసింగ్ షిఫ్ట్ బేస్డ్ అండ్ రికర్సివ్ సైకిల్ స్పిన్నింగ్ అండ్ వేవ్ ఆటమ్స్ టెక్నిక్స్’ అనే అంశంపై యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఇ.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎంఎస్ఎస్ సాయి తదితరులు అభినందించారు.

పంచాయతీల్లో నేడే మినీ పోరు

- నియోజకవర్గంలో 13 వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ
- ఇప్పటికే తొమ్మిది వార్డులు ఏకగ్రీవం
- నేడు నాలుగు వార్డులకు పోలింగ్
- మధ్యాహ్నం నుంచి కౌంటింగ్, సాయంత్రానికి ఫలితాల ప్రకటన



సీఐ, ఎస్ఐలకు బందోబస్తుపై స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్న డీఎస్పీ మహబూబ్ బాషా

ప్రత్తిపాడు: పంచాయతీల్లో మినీ సంగ్రామానికి సమయం ఆసన్నమయ్యింది. నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఖాళీగా ఉన్న నాలుగు వార్డులకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. నేడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. అనంతరం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

13 వార్డులకు నోటిఫికేషన్..

వాస్తవానికి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలం మేడావారిపాలెం పంచాయతీలో 2వ వార్డు, పాతమల్లాయపాలెంలో 10 వార్డు, నడింపాలెంలో 10వ వార్డు, నిమ్మగడ్డవారిపాలెంలో 4వ వార్డు, పెదగొట్టిపాడులో 2వ వార్డు, కాకుమాను మండలం బీకేపాలెంలో 8వ వార్డు, పెదనందిపాడు మండలం గొరిజవోలుగుంటపాలెంలో 8వ వార్డు, రావిపాడులో 8వ వార్డు, అబ్బినేనిగుంటపాలెంలో 4వ వార్డు, వరగానిలో 4, 8 వార్డులకు, గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెంలో 5వ వార్డుకు, ఓబులనాయుడుపాలెంలో 8వ వార్డుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది.

తొమ్మిది వార్డులు ఏకగ్రీవం..

ఎన్నికల కమిషన్ పదమూడు వార్డులకు నోటిఫికేషన్ జారీ చేయగా, అందులో తొమ్మిది వార్డులకు ఒక్కటే నామినేషన్ దాఖలు అవ్వడంతో అధికారులు వాటిని ఏకగ్రీవంగా ప్రకటించారు.

పటిష్ఠ బందోబస్తు..

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు బందోబస్తు చేపట్టనున్నారు. ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం డీఎస్పీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ఎన్నికలకు బందోబస్తు కల్పించామని డీఎస్పీ తెలిపారు. పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లను అనుమతించబోమని చెప్పారు.



ప్రత్తిపాడులో పోలింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రిని అందజేస్తున్న ఎంపీడీవో ఎ. శ్రీరమ్య



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

ఏకగ్రీవం అయిన వార్డుల వివరాలు ఇవే..

వార్డు	ఏకగ్రీవంగా గెలిచిన అభ్యర్థి
నిమ్మగడ్డవారిపాలెం 4వ వార్డు	గొరిజవోలు సతీష్
నడింపాలెం 10వ వార్డు	షేక్ బాజి
పాతమల్లాయపాలెం 10వ వార్డు	గుంటి భూషణం
మేడావారిపాలెం 2వ వార్డు	కుమ్మరి ఆనందకుమార్
చల్లావారిపాలెం	చల్లా వెంకటరెడ్డి
ఓబులనాయుడుపాలెం	పొత్తూరు విక్టోరియా
బీకె పాలెం	గొల్లమూడి రవిచంద్ర
వరగాని	గంగుల హనుమకుమార్
జీజీపాలెం	తవనం అన్నమ్మ

ఎన్నికలు జరగనున్న వార్డులు ఇవే..

- వరగాని 8వ వార్డు
- ఏబీ పాలెం 4వ వార్డు
- రావిపాడు 8వ వార్డు
- పెదగొట్టిపాడు 2వ వార్డు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని గ్రామంలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పాలన అంటే ఏమిటో ప్రజలు తెలుసుకున్నారన్నారు. దేశంలో ఎక్కడా అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సంగ్రామంలోకి అడుగు పెడుతున్నామని, సర్వేలన్నీ వైఎస్సార్ సీపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయని ఎమ్మెల్యే కిలారి పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి పార్టీకి విజయం చేకూర్చాలని ఆయన కోరారు. పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. సచివాలయం కన్వీనర్లకు, గృహ సారథులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రూ.10 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ స్కీంను అందజేస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సమావేశానికి పొన్నూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అన్నాబత్తుని సదాశివరావు హాజరయ్యారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి, శివాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ ఎ.శివశంకరరావు, జేసీఎస్ కన్వీనర్ చాగంటి మురళీమోహన్ రెడ్డి, పార్టీ నాయకులు గోళ్ల జోసఫ్, గోళ్ల శ్యాంము ఖర్జీ బాబు, షేక్ నజీర్, సయ్యద్ సుబాని, బుల్లా మోజేస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలోని జీబీసీ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శుక్రవారం పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం సాక్షి భావనారాయణ స్వామి దేవస్థానం నుంచి కూరగాయల మార్కెట్ వరకు రహదారి విస్తరణకు మేరకు భవనాలను యంత్రాల సహాయంతో తొలగించారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు జరుగుతున్నాయి. పూర్తి అయిన వెంటనే పనులు చేపట్టనున్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కృషి, పట్టుదలతో అనేక అవాంతరాలను ఎదుర్కొని రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణ పనులు త్వరతగతిన చేపట్టి పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కిలారి అధికారులకు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఎమ్మెల్యే కిలారికి బార్ అసోసియేషన్ సభ్యుల వినతి

పొన్నూరు కోర్టు భవనానికి మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు కోసం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని న్యాయవాదులు, పొన్నూరు బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యను తెలియజేశారు. కోర్టు భవనంగా రోటరీ క్లబ్‌ను ఇప్పించవలసిందిగా కోరారు. దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. బార్ అసోసియేషన్ సభ్యులు వర్ధన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నాగరాజు, నాగిశెట్టి శ్రీనివాసరావు, బొనిగల రాజారావు, పాందుగల చైతన్య, జయరాజు, విటల్ ప్రసాద్, అంకమ్మ రావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే రోశయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

వీవీఐటీలో పవర్ గ్రిడ్ ఆపరేషన్స్‌పై సదస్సు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్కాడా టూల్, పవర్ గ్రిడ్ ఆపరేషన్స్ అంశంపై అవగాహన సదస్సు జరిగింది. నంబూరు వీవీఐటీలో శుక్రవారం జరిగిన సదస్సుకు ముఖ్య వక్తగా ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.కిరణ్ హాజరయ్యారు. విద్యార్థులకు పవర్ గ్రిడ్ ద్వారా విద్యుత్ సరఫరా పనితీరును ఆయన వివరించారు. అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఏ విధమైన విధానాలు అవలంబించాలో విద్యార్థులకు వివరించారు. సైబర్ ఎటాక్స్‌ను బిగ్‌డేటా ఎనలిటిక్స్, డేటా సైన్స్ వినియోగం ద్వారా నిర్మూలించవచ్చన్నారు. స్కాడా సాఫ్ట్‌వేర్ టూల్ ద్వారా డేటాను సేకరించి, దానిని విశ్లేషించి పవర్ గ్రిడ్ స్థిరత్వాన్ని అదుపు చేయవచ్చని వివరించారు. ముందుగా ఐఈఐ విద్యార్థి విభాగం ప్రచురించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో డిప్యూటీ ఈఈ ఎం కిరణ్

డీఎస్సీ ఉచిత డెమో క్లాసులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం త్వరలో విడుదల కానున్న డీఎస్సీకి సన్నద్ధమవుతున్న బీఈడీ, డీఎడ్ విద్యార్థుల ప్రయోజనార్థం ఉచిత డెమో తరగతులను నిర్వహించనున్నట్లు విజయసాధన స్టడీ సర్కిల్ డైరెక్టర్ గంగా కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20, 21, 22వ తేదీల్లో బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల క్యాంపస్‌లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఉచిత డెమో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డెమో, రెగ్యులర్ తరగతులకు సంబంధించిన వివరాలకు 0863-2240433, 9293177737 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి భూముల రీ-సర్వే




భూముల రీ-సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు సాంబశివరావు

గుంటూరు రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. జగనన్న భూ రక్ష- శాశ్వత భూ హక్కు కార్యక్రమాన్ని ప్రారంభించారని గుంటూరు పశ్చిమ తహసీల్దారు కె.సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూముల రీ సర్వేను డ్రోన్ ద్వారా పశ్చిమ మండలంలో ప్రారంభించారు. మండలంలోని ఐదు రెవెన్యూ గ్రామాలలోని చిన్న పలకలూరులో చినపలకలూరు జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు పాల్గొన్నారు. రెవెన్యూ విభాగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు ఈ సర్వేతో పరిష్కారమవుతాయన్నారు. అనంతరం చిన్నపలకలూరు, మల్లవరం గ్రామాలలో 2574.83 ఎకరాలు, పెద్ద పలకలూరు రెవెన్యూ పరిదిలో తోకావారిపాలెం, గొర్లవారిపాలెం గ్రామాల్లో 1422.47 ఎకరాలు, నల్లపాడు రెవెన్యూ పరిధిలో తురకపాలెం గ్రామంలో 447.26 ఎకరాలు, అంకిరెడ్డిపాలెం రెవెన్యూ పరధిలోని వెంగళాయపాలెం, చల్లావారిపాలెం, లాలుపురం గ్రామాల్లో 3933.91 ఎకరాలు, పొత్తూరు రెవెన్యూ పరిధిలో ఓబులునాయుడుపాలెం గ్రామంలో 1462.86 ఎకరాలు, మొత్తం 10341.33 ఎకరాలను డ్రోన్ ద్వారా సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో రీ సర్వే జరిగిందన్నారు. అర్బన్ పరిధిలోని నల్లపాడు, పెదపలకలూరు, అంకిరెడ్డిపాలెం, పొత్తూరులో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రీసర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కె.సాంబశివరావు, చిన్నపలకలూరు వీఆర్‌వో పి.ప్రసన్నకుమార్, మల్లవరం గ్రామ వీఆర్‌వో ఎస్.సాగర్, గ్రామ సర్వేయర్ ఐ.విజయరత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ దర్శనం

రూ.2లక్షల విలువ చేసే నోట్లతో అలంకరణ

చేబ్రోలు: పొన్నూరు పట్టణం గుంటూరు రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారికి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. రూ.500లు, రూ.200, రూ.100, రూ.50, రూ.20, రూ.10 నోట్లు.. సుమారు రూ.రెండు లక్షల నగదుతో అలంకరించారు. సహస్రనామ కుంకుమార్చన, భజన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ధనలక్ష్మీగా కనకదుర్గమ్మ కరెన్సీనోట్ల ప్రత్యేక అలంకరణ

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- నరసరావుపేట ఎంపీ లావు
- సమస్యలను విన్నవించిన ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: గుంటూరు నగర పరిధిలోని సమస్యలు ఉన్న ప్రదేశాల్లో ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల ఏర్పాటు చేయటంలో తన వంతు కృషి చేస్తామని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం రింగ్‌రోడ్డులోని ఆయన నివాసంలో పలు సమస్యలపై తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నూరిఫాతిమా వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని నెహ్రూనగర్, మూడు వంతెనల రహదారి దగ్గర, సంజీవయ్యనగర్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు వైపు గడ్డిపాడు వద్ద.. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా నిర్మాణం జరిగేలా దృష్టి సారించి సహకరించాలని కోరారు. డీఆర్‌ఎం రామకృష్ణ సానుకూలంగా స్పందించినట్లు నాయకుల వివరించారు. అదే విధంగా నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధిపై చర్చించారు. స్టేడియానిను ఖేల్ ఇండియా ద్వారా అభివృద్ధి జరిగేలా కృషి చేస్తామని, వీలైతే తన ఎంపీ నిధులు కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు.



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్ గుర్తు తెలియని వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. డొంకరోడ్డు మూడువంతెనల సమీపంలోని కాలువలో సుమారు 45 సంవత్సరాల వ్యక్తి పడి మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రా

- గాంధీ జయంతి నాడు సంబరాలు ప్రారంభం
- సచివాలయం స్థాయి నుంచి క్రీడా పోటీలు
- ఎంపిక చేసిన క్రీడాకారులకు శిక్షణ

నెహ్రూనగర్: యువతలో ఆసక్తిని పెంచే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోంది. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడోత్సవాలకు చర్యలు చేపట్టింది. నైపుణ్యం కలిగిన క్రీడాకారాలను వెలికి తీసేందుకు క్రీడా సంబరాన్ని మోగించనుంది. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి నాటి నుంచి 46 రోజుల పాటు వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రీడా సంబరాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆటపాటలతో పాటు మూడు కిలో మీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి సంప్రదాయేతర పోటీలు నిర్వహించనున్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

నగరపాలక సంస్థ పరిధిలో 207 వార్డు సచివాలయాలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 207 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో క్రీడకారులను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతగా దోహదపడనున్నాయి. క్రీడల్లో నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభ కనపరిచిన వారికి రూ.10వేల నుంచి రూ.5లక్షల వరకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి



క్రీడలపై ఆసక్తి ఉన్నవారు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం తీసుకొచ్చింది. ఆసక్తి గల వారు తమ పేర్లు వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి. అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు నుంచి క్రీడ పోటీలు సచివాలయం స్థాయిలో ప్రారంభమవుతాయి.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

క్రీడా పోటీల తేదీలు ఇలా...

- వార్డు సచివాలయ స్థాయి అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు
- మండల స్థాయిలో అక్టోబర్ 13 నుంచి 18వ తేదీ వరకు
- నియోజకవర్గ స్థాయిలో అక్టోబర్ 21 నుంచి 24వ తేదీ వరకు
- జిల్లా స్థాయిలో అక్టోబర్ 27, 28 తేదీల్లో
- రాష్ట్ర స్థాయిలో నవంబర్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు

మున్సిపల్ ఉద్యోగులు ఆధార్ అప్డేట్ చేసుకోవాలి

- 23 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక క్యాంపు
- మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: ఈఎస్ఐ సంస్థ నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, కార్మికులు వారి ఆధార్ కార్డుతో పాటు కుటుంబ సభ్యుల వివరాలతో అప్డేట్ చేసుకోవాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు శుక్రవారం తెలిపారు. నగరపాలక సంస్థలో సుమారు 3 వేల మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారని ఉద్యోగులు, కార్మికుల సౌకర్యార్థం అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఎండీతో మాట్లాడి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోనే అప్డేట్ చేసేందుకు స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విభాగాల వారీగా కార్మికుల వివరాలు అప్డేట్ చేయడానికి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ సంస్థ సిబ్బందికి నగరపాలక సంస్థ సిబ్బంది సహకరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్న గోరుముద్ద నాణ్యతగా అందించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలను పూర్తి నాణ్యతగా అందించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పేర్కొన్నారు. శుక్రవారం పాత్తూరువారి తోటలోని నగరపాలక సంస్థ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడవద్దని, రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

గంజాయి వినియోగిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: గంజాయి తీసుకుంటున్న వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్‌లో ఓ వ్యక్తి గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారంతో పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. గంజాయితో ఉన్న రాకేష్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.